సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యం

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందా?. క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తే అవుననే అనిపిస్తోంది. సచివాలయ సేవలు క్రమంగా ప్రజలకు దూరమవుతున్నాయి.

- నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎత్తుగడ
- అలంకారప్రాయంగా కార్యాలయాలు
- నామమాత్రంగా సిబ్బంది హాజరు
- ప్రజలకు అందని సేవలు


మనుబోలు - 2 సచివాలయంలో విధుల్లో ఉన్న సిబ్బంది

మనుబోలు: మండల కేంద్రానికి దూరంగా ఉండే గ్రామాల ప్రజలు 2019 సంవత్సరానికి ముందు వరకూ ప్రతి చిన్న సమస్యకు తహసీల్దార్ కార్యాలయానికో, మండల పరిషత్ కార్యాలయానికో పరుగులు పెట్టేవారు. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడేవారు. కూలి పనిచేసుకునే వారైతే పనులు మానుకుని రోజంతా కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పరిస్థితికి చెక్ పెట్టేలా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంత ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు రావాల్సిన పనిలేకుండా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి భవనాలు నిర్మించింది.

ఎన్నో సేవలు

మండలంలో 14 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒక్కో భవనాన్ని రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించారు. 11 శాఖల అధికారులను అక్కడ ఉంచి ఎన్నోసేవలను అందించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, విద్యార్హత, ఇతర ధ్రువీకరణపత్రాలు అవసరమైన వారు వెంటనే సమీపంలో ఉన్న సచివాలయానికి వెళ్తే సకాలంలో అందేవి. సంక్షేమ పథకాలకు సులువుగా దరఖాస్తు చేసుకునే పరిస్థితులు నాడు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. వాటి అభివృద్ధి, ప్రజలకు సకాలంలో సేవల గురించి పట్టించుకోవడం లేదు.

నేడిలా..

ప్రస్తుతం కార్యాలయాల్లో సిబ్బంది నామమాత్రంగా కనిపిస్తున్నారు. మనుబోలు - 1 సచివాలయంలో అయితే కేవలం ఇద్దరు మాత్రమే ఉంటారు. వారు కూడా రెగ్యులర్‌గా అందుబాటులో ఉండరనే ఆరోపణలున్నాయి. సచివాలయంలో ఏ సేవలు లభిస్తాయో తెలిపే బోర్డులు సైతం ఇప్పుడు లేవు. మండలంలో ఎక్కడా ఆధార్ సేవలు అందుబాటులో లేవు. అడిగితే కంప్యూటర్ పాడైందని, డేటా లేదని, డిజిటల్ ఆపరేటర్ సెలవులో ఉన్నాడని చెబుతున్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నా గూడూరుకు వెళ్లాల్సిందే. దీంతో ఆరునెలల ముందు వరకూ కళకళలాడిన గ్రామ సచివాలయాలు నేడు కూటమి ప్రభుత్వ వైఖరి కారణంగా వెలవెలబోతున్నాయి.


మనుబోలు బిట్ - 1 సచివాలయంలో పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

సిబ్బంది కొరత ఉంది



బదిలీల కారణంగా చాలాచోట్ల సచివాలయాల సిబ్బంది కొరత ఉంది. మండలంలో నాలుగుచోట్ల ఆధార్ నమోదుకు కేటాయిస్తే మూడుచోట్ల కంప్యూటర్లు పనిచేయడం లేదు. ఒకచోట డిజిటల్ అసిస్టెంట్ అందుబాటులో లేరు. బయోమెట్రిక్ ద్వారా తప్పనిసరిగా హాజరు వేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చాం. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తాం.

– జలజాక్షి, ఎంపీడీఓ

సేవలను అందుబాటులోకి తేవాలి



గతంలో చాలారకాల సేవలు సచివాలయాల్లో అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వివిధ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. దీనికి తోడు ఆధార్ సేవలు కూడా లభించడం లేదు. సచివాలయాల్లో అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకురావాలి.

– ముంగర రవీందర్‌రెడ్డి, మనుబోలు

క్లుప్తంగా

కాకాణిని కలిసిన ఎంపీటీసీ సభ్యులు



పొదలకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మంగళవారం మండలంలోని ఎంపీటీసీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

కూలిపోయిన కల్వర్టు

- అక్కంపేట – కసుమూరు మధ్య రాకపోకలు బంద్


రాకపోకలు ఆపేస్తూ అడ్డుగా పెట్టిన ముళ్లకంప

మనుబోలు: వర్షానికి మండలంలోని అక్కంపేట నుంచి కురిచెర్లపాడు, కసుమూరు గ్రామాలకు వెళ్లే మార్గంలో మంగళవారం కల్వర్టు కూలిపోయింది. దీంతో అక్కంపేట నుంచి కురిచెర్లపాడు, కసుమూరు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. అలాగే అక్కంపేట గ్రామ పరిధిలోని పొలాలకు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పోయింది. అక్కంపేట నుంచి ఈ రోడ్డు మార్గంలో కురిచెర్లపాడుకు 3 కిలోమీటర్లు, కసుమూరుకు 7 కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. ఇప్పుడు వడ్లపూడి నుంచి లేదా హైవేపైకి వచ్చి కొమ్మలపూడి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. 15 నుంచి 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తుంది. అక్కంపేటకు చెందిన కొంత భాగం పొలాలు కూడా అటే ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బడ్జెట్లో కార్మిక వర్గానికి మొండిచేయి


మాట్లాడుతున్న సురేష్

బుచ్చిరెడ్డిపాళెం: కార్మిక వర్గానికి రాష్ట్ర బడ్జెట్లో మొండిచేయి చూపారని ఆటో కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కోలగట్ల సురేష్ విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆటో యూనియన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు అమలైన తరహాలో లైసెన్స్‌లు, ఎఫ్సీలను ఆర్టీఏ అధికారులే ఇవ్వాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని 13 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పాశం రాజయ్య, దాసరి రాజయ్య ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు రాజు, సీఐటీయూ మండలాధ్యక్ష, కార్యదర్శులు మునీర్ అహ్మద్, చల్లకొలుసు మల్లికార్జున, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అసోసియేట్ డీన్‌కు అవార్డు


బాలసుబ్రమణియన్

ముత్తుకూరు: ముత్తుకూరులోని మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.బాలసుబ్రమణియన్ మంగళవారం ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందించారు. ఆయన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. నూతనంగా ఏర్పడిన ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీకు సంబంధించి ఆయన ఈ అవార్డును స్వీకరించారు.

పిల్లలపై జాగ్రత్త వహించాలి

కొడవలూరు: సీజనల్ వ్యాధుల బారిన పిల్లలు పడకుండా తల్లులు జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని సీబీఎన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త మంజుల, సహాయకురాలు పోలేరమ్మ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



కొడవలూరు: కర్నూలులో నిర్వహించిన హ్యాకథాన్‌లో మండలంలోని నార్తురాజుపాళెంలో గల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థి మహ్మద్ ఫయాజ్ విజేతగా నిలిచారు. ఈ క్రమంలో కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని చైర్మన్ డాక్టర్ గుణశేఖర్ అభినందించారు. కోడింగ్‌లో తమ కళాశాలలో ఇస్తున్న శిక్షణతోనే ఫయాజ్ విజేతగా నిలిచారని కొనియాడారు. ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఏఓ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్ పట్టల అందజేత

కొడవలూరు: స్థానిక ఎన్టీఆర్ గిరిజన కాలనీలోని 22 కుటుంబాలకు టార్పాలిన్ పట్టలను ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి పావని మాట్లాడారు. వర్షాలతో గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, సమస్యను దృష్టిలో ఉంచుకొని గుడిసెలున్న కుటుంబాలకు టార్పాలిన్ పట్టలను అందజేశామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి మురళి, వీఆర్వో శ్రీనివాసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రసన్నను కలిసిన నేతలు



కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో ఇందుకూరుపేట మండలం మైపాడుకు చెందిన పార్టీ నేతలు మంగళవారం కలిశారు. లింగారెడ్డి, దేవరపల్లి పరంధామిరెడ్డి, మాచర్ల రాజగోపాల్‌రెడ్డి, కాకుటూరు వెంకటకృష్ణారెడ్డి, దేవరపల్లి క్రాంతికుమార్‌రెడ్డి, కావలి వెంకయ్య, మహేష్, విజయ్, చంద్రయ్య, సుధాకర్, దేవీప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- ఇందుకూరుపేట నేతలు నెల్లూరు వెంకటరమణయ్య, మేనాటి ప్రసాద్, కదురు వెంకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్సైకు గాయాలు

వెంకటాచలం: గుర్తుతెలియని వాహనం ఢీకొని మనుబోలు ఏస్సై షేక్ జిలానీ గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జిలానీ మనుబోలు నుంచి నెల్లూరుకు మోటార్‌బైక్‌పై వెళ్తుండగా చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జిలానీకి గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలాల్లో భారీ వర్షాలు


పొదలకూరులో వర్షం

తోటపల్లిగూడూరు: అల్పపీడన ప్రభావంతో మంగళవారం కురిసిన భారీ వర్షాలకు మండలంలో జనజీవనం స్తంభించింది. కోడూరు, వెంకన్నపాళెం తీరప్రాంత గ్రామాల వాసులు వానలు, గాలుల కారణంగా వణికిపోయారు. ఆకాశం మేఘావృతమై పగలే చీకట్లు కమ్ముకున్నాయి. లోతట్టు ప్రాంతాలు, రహదారులు ముంపునకు గురయ్యాయి. తుఫాన్ ముప్పు ఉందనే ప్రచారంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

పొదలకూరులో..

పొదలకూరు: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మూడురోజులపాటు వర్షసూచన ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. ఉదయానికి 11 మి.మీ నమోదైనట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులు వరినార్లు పోసుకుంటున్న సమయంలో వర్షం కురవడంతో ప్రస్తుతం నష్టం లేకపోయినా.. మూడు రోజులు వర్షం కురిస్తే రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని ఏఓ వాసు వెల్లడించారు. చాలా గ్రామాల్లో నార్లు పోసుకునేందుకు సమాయత్తమయ్యారు. కొన్నిచోట్ల నారుమడులు ఉండగా పెన్నార్ డెల్టా గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. వర్షం కురిస్తే నారుమడులు దెబ్బతినే అవకాశం ఉంటుంది. రైతులు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఏఓ సూచించారు.

- **బుచ్చిరెడ్డిపాళెం:** పట్టణంలో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలు

పొదలకూరు: వ్యవసాయ విద్యుత్ (త్రీ ఫేజ్) సరఫరా వేళలను పొదలకూరు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ వెల్లడించారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ గ్రూపు ఉదయం 7.15 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, బీ గ్రూపు ఉదయం 8.45 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న తహసీల్దార్ స్ఫూర్తి

కొడవలూరు: గ్రామసభలో తెలియజేసిన సమస్యలను తప్పక పరిష్కరిస్తామని తహసీల్దార్ స్ఫూర్తి పేర్కొన్నారు. రీ సర్వే సమస్యలపై కొడవలూరులో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో అర్జీలను స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. రీ సర్వే డీటీ అరుణ్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీలత, వీఆర్వో శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ స్వప్న పాల్గొన్నారు.

స్థానిక సంస్థల విధులు తెలుసుకోవాలి

పొదలకూరు: సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు స్థానిక సంస్థల అధికారాలు, విధులు తెలుసుకోవాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024 – 25పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తామన్నారు. తొలిరోజున వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


మాట్లాడుతున్న డాక్టర్ నరసింహారావు

పొదలకూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయసులో పెళ్లి చేస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయని మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.నరసింహారావు పేర్కొన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. డాక్టర్ స్రవంతి, సీడీపీఓ విజయలక్ష్మి, మహిళా పోలీస్ శ్రీలత, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పెంచలమ్మ, రత్నమ్మ, ప్రమీల, సుజాత పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కొడవలూరు: పల్లె పండగలో భాగంగా మండలానికి రూ.82 లక్షలు మంజూరైన తరుణంలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బారావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులు, సహాయకులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండలంలోని 37 అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, నీటి వసతిని మంజూరు చేసిన తరుణంలో పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పక్కా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

వీఎస్‌యూ అభివృద్ధికి సమష్టి కృషి

- నిపుణుల కమిటీ సభ్యుడు డాక్టర్ బి.రాజశేఖర్


సమీక్షలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ, నిపుణుల కమిటీ సభ్యులు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అభివృద్ధి, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ మెరుగు కోసం సమష్టి కృషి అవసరమని నిపుణుల కమిటీ సభ్యుడు బి.రాజశేఖర్ అభిప్రాయపడ్డారు. 2027 నాటికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వీఎస్‌యూను టాప్ 100లోకి చేరే వ్యూహాలను రూపొందించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దీని సభ్యులు మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీని మంగళవారం సందర్శించారు. పలు అంశాలపై సమీక్షించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలతో పోటీ పడుతూ వీఎస్‌యూను టాప్‌లో నిలపడం అవసరమని పేర్కొన్నారు. పరిశోధన, కార్యకలాపాలు, ప్రచురణలు, ప్రాజెక్టులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, శిక్షణ కార్యక్రమాలను పెంచడం ద్వారా ప్రగతిని సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. మేధావులు, పరిశ్రమలతో కలిసి ఉద్యోగావకాశాలు, నిధులు, పరిశోధన కార్యాచరణలు, గెస్ట్ లెక్చర్లు నిర్వహించేందుకు ప్రఖ్యాత ఫ్యాకల్టీని ఆహ్వానించడం అవసరమని సూచించారు. బోధనేతర సిబ్బంది సమర్థవంతమైన టీమ్ వర్క్ కలిగి ఉండాలని, సింగిల్ విండో సిస్టం, ఆటోమేషన్ సిస్టం, అభిప్రాయ, అభినందన అంశాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. సమీక్షలో ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, కమిటీ సభ్యులు పీజుష్ కాంతి పాణిగ్రహి (ఐక్యూఏసీ డైరెక్టర్, కోల్‌కతా విశ్వవిద్యాలయం), సంజయ్ ధోలే (ఐక్యూఏసీ డైరెక్టర్), ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

కోవెరపాళెంలో స్థల వివాదం

- తోపులాటలో వ్యక్తికి గాయాలు


గాయపడిన మస్తాన్

తోటపల్లిగూడూరు: స్థల వివాదం ముదరడంతో జరిగిన తోపులాటలో ఓ వ్యక్తి గాయపడిన జరిగిన ఘటన మంగళవారం కోవెరపాళెం గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎల్లసిరి మస్తాన్ అనే వ్యక్తి 24 అంకణాల స్థలాన్ని కొనుగోలు చేసి 17 అంకణాల్లో ఇంటిని నిర్మించుకున్నాడు. ఏడు అంకణాల్లో మరో గదిని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. అది పంచాయతీ స్థలమంటూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నిర్మాణానికి అడ్డు తగిలారు. 30 ఏళ్లగా తమ స్వా. ధీనంలో ఉన్న ఈ స్థలం పంచాయతీకి ఎలా చెందుతుందని మస్తాన్ ప్రశ్నిస్తున్నారు. మంగళవారం టీడీపీ నాయకులు, అధికారులు మస్తాన్ స్థలం వద్దకు చేరుకుని నిర్మాణాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో బాధిత కుటుంబం వారిని వారించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. మస్తాన్ కింద పడి గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించిన కుటుంబసభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఓ రైతు పంట పొలానికి దారి ఇవ్వాలని టీడీపీ నాయకులు చెబుతున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారన్నారు. అధికారులు, పోలీసులు న్యాయం చూడకుండా అధికార పార్టీ నాయకులకే వత్తాసు పలకడం అన్యాయమన్నారు.

విత్తనశుద్ధి చేసి నార్లు పోసుకోవాలి

పొదలకూరు: విత్తనశుద్ధి చేసి వరినార్లు పోసుకోవాలని డీఆర్సీ ఏడీఏ లక్ష్మీమాధవి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మహ్మదాపురం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ కె.శివనాయక్ ఏఓ వాసు మాట్లాడారు.

- **తోటపల్లిగూడూరు:** మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చని ఆత్మ పీడీ శివన్నారాయణ తెలిపారు. మండలంలోని సోత్‌ఆములూరు, ముంగళదొరువు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి.
- **కొడవలూరు:** నారుమడిలో యాజమాన్యం ముఖ్యమని ఏఓ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొత్తవంగల్లు, మిక్కిలింపేటలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. దుక్కిలో ఎరువుల వినియోగాన్ని భూసార పరీక్షల ఆధారంగానే జరపాలని సూచించారు.

రేషన్ సరుకుల పంపిణీ ఎప్పటికో..?

కోవూరు: మండలంలోని గంగవరంలో రేషన్ సరుకులను ఎప్పటికి పంపిణీ చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఇక్కడ 600 పేద కుటుంబాలున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడనే కారణంతో ఇప్పటి వరకు ఉన్న డీలర్‌ను తొలగించారు. డీలర్‌షిప్ కావాలంటే రూ.మూడు లక్షలను సమర్పించాలని ఆ గ్రామ నేతలు పేర్కొనడంతో గతంలో కలకలం రేగింది. అప్పట్లో విషయం ఎమ్మెల్యేకు తెలియడంతో దానికి బ్రేక్ పడింది. ఈ పరిణామాల క్రమంలో ఈ నెల్లో సరుకులను గ్రామానికి వచ్చి పంపిణీ చేయలేదు. కాగా ఈ విషయమై సివిల్ సప్లయ్స్ డీటీ బాలకోటమ్మను సంప్రదించగా, డీలర్‌పై ఫిర్యాదులు రావడంతో ఆయన్ను పక్కనబెట్టామని, రేషన్ సరుకులను బుధవారం నుంచి పంపిణీ చేస్తామని బదులిచ్చారు.

రేపట్నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విడవలూరు: స్థానిక గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నామని లైబ్రేరియన్ నిరూప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. కార్యక్రమాలకు తరలిరావాలని కోరారు.

పరీక్షలకు 113 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 113 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 826 మంది విద్యార్థులకు గానూ 713 మంది హాజరయ్యారని వెల్లడించారు.

ముత్తుకూరుకు కాకాణి రాక నేడు

ముత్తుకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఉదయం ముత్తుకూరుకు వస్తారని ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగే పోలీసు విచారణకు కాకాణి హాజరవుతారని వెల్లడించాయి.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టులో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు ఇంజినీర్లు మంగళవారం తెలిపారు. ఒకటో యూనిట్లో 490 మెగావాట్లు, రెండో యూనిట్లో 450 మెగావాట్లు, మూడో యూనిట్లో 520 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


వైష్ణవి


గీతాకుమారి


రక్షిత

వెంకటాచలం: చిత్తూరు జిల్లా అరగొండలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ – 14 సాఫ్ట్‌బాల్ పోటీలకు గొలగమూడిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. 9 తరగతి చదువుతున్న ఆశ్రిత వైష్ణవి, గీతాకుమారి, 7వ తరగతి విద్యార్థిని రక్షిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీకామేశ్వరీదేవి, పీడీ షేక్ షబిక మంగళవారం తెలియజేశారు.